క్లుప్తంగా

పరీక్ష సామగ్రి పంపిణీ



అయిజ: మండలంలోని మేడికొండ ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థి చాంద్ బాష తన కుమార్తె జోహా జన్మదినం సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. అదే విధంగా గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. 5,016, రూ.3,016 నగదు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు చిన్న తిమ్మప్ప, ఏబేలు, రామానాయుడు, నరసింహులు, రుక్మాత్, జగదీశ్ రూతు, అనుపమ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపు కోసం పోరాడాలి



గట్టు: గెలుపు కోసం చివరి దాకా పోరాడాలని మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం చాగదోనలో రేణుక ఎల్లమ్మ జాతర సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడలు స్నేహ పూర్వక వాతావరణంలో సాగాలన్నారు. పోటీల వలన ప్రతిభ కల్గిన గ్రామీణ క్రీడాకారులకు గుర్తింపు లభిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీలు బుడ్డప్ప, సునంద్, నాయకులు బాబు, తిరుమల్‌గౌడ్, మహేశ్వర్‌గౌడ్, గూరన్న, శేషాద్రి, నాగరాజు, వీరేష్, లక్ష్మణ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన రిజిస్ట్రార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలో పీజీ సెమిస్టర్–3 పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈమేరకు పీయూ పీజీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్ చెన్నప్ప సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులు చూచిరాతలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి, అనురాధారెడ్డి పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడాలి



అయిజ: మండలంలో రోజురోజుకు నేరాలు పెరిగి పోతున్నాయని, పోలీసులు శాంతి భద్రతలు కాపాడాలని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు కూతవేట దూరంలో ఓ మహిళను కారులో ఎత్తుకెళ్లి దారుణంగా గొంతుకోసి చంపడం దారుణమైన ఘటన చోటుచేసుకుందన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలి యని దుండగులు చించివేస్తున్నారన్నారు. మండలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ నాయకులు ఆది, రాజశేఖర్, నరసింహులు, రఘు, భీమేష్ పాల్గొన్నారు.

బీజేపీ రైతులకు చేయూతనిస్తోంది

అయిజ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు చేయూతనిస్తోందని, లక్షలాది మంది రైతులకు ఆర్థిక సహాయం అందించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రారంభించిందని బీజేపీ మండల నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మోదీ ప్రభుత్వం రైతుల కు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘు, లక్ష్మణ్ గౌడ్, లక్ష్మణాచారి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లి: మండల కేంద్రానికి చెందిన జల్లాపురం హనుమంతురెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అలంపూర్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జోగుల రవి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి సోమవారం హనుమంతురెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు

- లక్షలు ఖర్చుచేసినా అందుబాటులోకి రాని బస్టాండ్
- చౌరస్తాలోనే బస్సుల నిలుపుదల
- ప్రయాణికులకు తప్పని అవస్థలు



ధరూరులో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్

ధరూరు: లక్షల ప్రజా ధనాన్ని వెచ్చించి నిర్మించిన బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురావడంలో అధికార యంత్రాగం పూర్తిగా విఫలమవుతోంది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం దాదాపు రూ.14 లక్షల వ్యయంతో బైపాస్ రోడ్డులో బస్టాండ్ నిర్మించారు. దానిని వినియోగంలోకి తీసుకొచ్చి ప్రయాణికులకు ఉపయోగపడేలా చూడాల్సిన అధికారులు దానిపై దృష్టి సారించడం లేదు. దీంతో నిలువ నీడ లేని చౌరస్తా వద్ద బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందని మండల ప్రజలు వాపోతున్నారు.

రూ.లక్షలు వృథా..

రెండు దశాబ్దాల క్రితం ధరూరులో బస్టాండ్‌ను స్థల దాతలు కే.శే వీరప్ప, బస్వరాజులు ఇచ్చిన స్థలంలో రూ.14 లక్షల వ్యయంతో నిర్మించారు. కానీ బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురావడంలో ఆర్టీసీ శాఖ పూర్తిగా విఫలమైంది. ఏడెనిమిదేళ్ల క్రితం కొంతకాలం ఆర్టీసీ కంట్రోలర్‌ను నియమించి బస్సులు ఆపారు. ఆ తరువాత దాని ఊసే ఎత్తడం లేదు. గద్వాల నుంచి రాయచూర్ వరకు 50 కిమీ పొడవునా ఎక్కడా బస్టాండ్లు లేవు. తాగునీరు కూడా దొరకని పరిస్థితి ఉంది.

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు..

మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నిత్యం వందలాది మంది ధరూరు మీదుగా గద్వాల, రాయచూర్ వంటి ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. వైఎస్సార్ చౌరస్తా వద్దనే బస్సులు, జీపులు, ఆటోలు ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుంటాయి. బస్టాండు పక్కనే ఉన్నా



ప్రస్తుతం చౌరస్తా వద్ద బస్సులు ఆగుతున్న ప్రాంతం

అక్కడ బస్సులు ఆపడం లేదు. దీంతో నిలువ నీడ లేని ప్రాంతంలో ఎండలో వేచి ఉండి ప్రయాణాలు చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ప్రయాణికుల రద్దీ పెరుగుతున్నా తగు సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో చౌరస్తాలో బస్సుల కోసం గంటల తరబడి రోడ్డు మీద వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు.

ఆర్టీసీ డీఎం వివరణ...

ఈ విషయమై గద్వాల ఆర్టీసీ డీఎం మురళీకృష్ణను సాక్షి వివరణ కోరగా.. ప్రైవేటు వాహనాలన్నీ చౌరస్తా వద్ద ఆగుతుండడంతో ప్రయాణికులు బస్టాండు వద్దకు రావడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. గద్వాల నుంచి రాయచూర్ వరకు మధ్యలో ఎక్కడా బస్టాండు లేకపోవడంతో ధరూరు బస్టాండ్ వద్ద కమర్షియల్ పర్పస్ దాబా ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అనుమతి వచ్చిన వెంటనే బస్సులు ఆపడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

> **బస్టాండులో ఆపాలి..**
>
> 
>
> బస్టాండులో బస్సులు ఆపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎండ, వర్షానికి హోటళ్లు, రోడ్డు మీద నిల్చొని బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.
>
> – నాగరాజు, ధరూరు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న మహిళా సాధికారత అధికారి సరోజ

మల్దకల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని జిల్లా మహిళా సాధికారత అధికారి సరోజ అన్నారు. సోమవారం మండలంలోని నీలిపల్లి గ్రామంలో నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పడావో శతాబ్ది ఉత్సవాలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. ఆడపిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా వారి బంగారు భవిష్యత్‌కు నాంది పలుకుతుందన్నారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, మహిళల అక్రమ రవాణా వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, టీచర్లు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీమా సౌకర్యాలు వినియోగించుకోవాలి



గట్టు: బ్యాంకులు అందించే బీమా సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ ప్రకాష్ కోరారు. సోమవారం మాచర్ల గ్రామంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ప్రకాష్ మాట్లాడుతూ.. నగదు రహిత లావాదేవీలను నిర్వహించే క్రమంలో ఖాతాదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్థిక మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. మోసాల బారిన పడినపుడు 1930 కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ తెలియజేయవద్దన్నారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై వంటి బీమా సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

మానవపాడు: మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం సీనియర్ ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు, అధ్యాపకులు మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకుని కృషితో ఎదగాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, ఎంఈఓ శివప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్, అధ్యాపకులు వెంకటకృష్ణారెడ్డి, లక్ష్మన్న, మహేందర్‌గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు మహాత్మా జ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాలలో పది, , ఇంటర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ హృదయరాజు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పరీక్షల సమయంలో సూచనలు, సలహాలు అందజేశారు. ప్రతి విద్యార్థి విజయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల నిర్వహించిన నృత్యప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవానందం, కవిత, ధర్మారెడ్డి, ఎంఈఓ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పుల్లూరు గురుకుల పాఠశాలలో విద్యార్థుల నృత్యప్రదర్శన

బీచుపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం బీచుపల్లి శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పరమశివుడికి వివిధ అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

ధరూరు: మద్యం తాగి వాహనం నడపరాదని ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న పోలీసులు

అరణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సిద్ధం

- కోతులగిద్దలో ముమ్మరంగా ఏర్పాట్లు
- 26 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ఆలయ ప్రాంగణం సుందరంగా ముస్తాబు

ధరూరు: మండల పరిధిలోని కోతులగిద్ద అరణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈనెల 26, 27న రెండు రోజుల పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. కోతులగిద్ద గ్రామ సమీపంలోని గుట్టపై వెలసిన అరణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకోనున్నారు.

సేవల వివరాలు..

26వ తేదీ బుధవారం ఉదయం సుప్రభాత సేవ, గణపతిపూజ, రుద్రాభిషేకం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అదేరోజు శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 26న స్వామివారి ఉచ్చాయ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలు జయప్రదం చేయాలని కోరారు.



గుట్టపై వెలసిన అరణ్యేశ్వర స్వామి



స్వామివారు కొలువైన గుట్ట

కోతులగిద్దలో పండుగ వాతావరణం...

ఉత్సవాలను పురస్కరించుకొని కోతులగిద్ద గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామస్తులు ఇంటి ఆడపడుచులను పిలుపించుకుని సంబరంగా ఉత్సవాలు చేసుకుంటారు. శివరాత్రి పర్వదినం నాడు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

విద్యతోపాటు నాణ్యమైన భోజనం



కొర్విపాడు పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ శివప్రసాద్



ధరూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

కేటీదొడ్డి: విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని వాగుతంగా, గువ్వలదిన్నె పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అన్న విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పరిశీలన..

ధరూరు: మండల పరిధిలోని పారుచర్ల, ఎములోనిపల్లి, రేవులపల్లి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆహార నాణ్యతపై ఆరా తీశారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గడువు ముగిసిన సరుకులు వినియోగించవద్దన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి..

మానవపాడు: మండలంలోని కొర్విపాడు పాఠశాలను ఎంఈఓ శివప్రసాద్ ప్రార్థన సమయంలో సందర్శించారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించి సూచనలు అందించారు. ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు సమయపాలన తప్పక పాటించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

అలంపూర్: మున్సిపాలిటీల్లో వంద శాతం పన్ను వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు అన్నారు. మున్సిపల్ అధికారులు సోమవారం ఇంటి పన్నుల వసూలు కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పన్నుల కరంట్ డిమాండ్ రూ.39.49 లక్షలు, ఎరియర్స్ డిమాండ్ రూ. 8.07 లక్షలు, మొత్తం డిమాండ్ రూ. 48.51 లక్షలుగా ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.28.28 లక్షలు వసూలు చేయగా, రూ.20.23 లక్షలు పన్ను వసూలు కావాల్సిందిగా పేర్కొన్నారు. సోమవారం ఒక్కరోజు రూ. 18,925 వసూలైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

గద్వాల: ఎస్సీల అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన రూ.11కోట్ల నిధులు వినియోగం చేయకపోవడంతో ప్రభుత్వానికి వెనక్కి వెళ్లడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ అన్నారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. రిటర్న్ అయిన నిధులను తిరిగి తెప్పించి నిరుపేద ఎస్సీలకు వినియోగించాలని కోరారు. అదే విధంగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతాప్, ప్రవీణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం: అక్రమంగా తరలిస్తున్న 23 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం సాయంత్రం బీరోలు గ్రామానికి చెందిన శ్రీరామ్ గూడ్స్ వాహనంలో 23 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కర్నూల్ జిల్లాకు తరలిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడి చేసి బీరోలు గ్రామ శివారులో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బీజేపీ పాలనలో దళితుల జీవితాలు దుర్భరం

మహబూబ్‌నగర్ రూరల్: ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లోని బీజేపీ పాలనలో దళితుల జీవితాలు దుర్భరంగా మారాయని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా స్థాయి సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యంరాజు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ .. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడానికి మార్చి 2, 3వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాలు ఉంటాయని అన్నారు. అట్టడుగు వర్గాలకు ద్రోహం చేసే విధంగా బీజేపీ విధానాలు ఉన్నాయని, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి నేటితరం సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర స్థాయి సమావేశాలను మార్చి 2న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ ప్రారంభిస్తారని, రాష్ట్ర నలుమూలల నుండి రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ సెమినార్‌లో యువకులు, విద్యార్థులు, విద్యావంతులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, నాయకులు మనోహర్, ప్రవీణ్, రమేష్, విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

‘అక్రమార్కులకు అండగా అధికారులు’

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో అక్రమార్కులకు అధికారులు ప్రోత్సహిస్తు అండగా నిలుస్తున్నారని సీపీఐ జిల్లాకార్యదర్శి విజయరాములు ఆరోపించారు. సోమవారం స్థానిక పుర కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పట్టణంలోని బాబా కాలనీలో టీఎన్జీఓ భవనం పక్కన ఉన్న 20 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎంపీపీ తన రాజకీయ పలుకుబడితో రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి యథేచ్ఛగా షాపుల నిర్మాణం చేపడుతున్నారని, నిర్మాణాలను నిలిపివేస్తామని హామీనిచ్చిన కమిషనర్ పనులు జరుగుతున్నా పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. మున్సిపాలిటీలో గతంలో ఏర్పాటు చేసిన వెంచర్లలో ఇచ్చిన 10 శాతం ప్లాట్లు సైతం అసెస్‌మెంట్ తీసుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జాదారుల చెర నుంచి స్వాధీనం చేసుకోవాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీహరి, సీఎన్‌శెట్టి, మోష, అబ్రహం, భాస్కర్, కుతుబ్, రవీందర్, శేఖర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణశెట్టి, కుమార్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



పుర కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సంఘటితమైతేనే సమస్యలు పరిష్కారం

స్టేషన్ మహబూబ్‌నగర్: విశ్రాంత ఉద్యోగులు సంఘటితమైతేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఫోరం కార్యాలయంలో జరిగిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్ల క్రితం రిటైర్డ్ అయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన లివ్ ఎన్ క్యాష్‌మెంట్ బకాయిలు, 2017 పీఆర్‌సీకి సంబంధించిన బకాయిలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. డైరీ డెవలప్‌మెంట్ రిటైర్డ్ అధికారి యాదయ్య, రంగినేని మన్మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, భగవంతు, జీబీ.పాల్, నాగాంజనేయులు, ఆర్.నారాయణ, బి.మోహన్‌రెడ్డి, నస్కంటి నాగభూషణం, భీమమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు